ఆంధ్రజ్యోతి
andhrajyothy.com సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.9, కనిష్ఠం 24.1

నిజామాబాద్
జిల్లా వార్తలు
5 మంగళవారం 14 మే 2024


• ఇందల్వాయి మండలం గౌరారంలో చంటిబిడ్డతో ఓటు వేసేందుకు వచ్చిన మహిళ


• బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ

ప్రశాంతంగా పోలింగ్




• జిల్లా కేంద్రంలో బారులు తీరిన ఓటర్లు


• నవీపేటలో ఓటుహక్కును వినియోగించుకున్న 95 ఏళ్ల అంధ వృద్ధురాలు మల్లుబాయి



పార్లమెంట్ పరిధిలో 71.47% పోలింగ్


• ఓటు వేసిన కలెక్టర్

- ముగిసిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్
- ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన ఓటర్లు
- యువత నుంచి మహిళల వరకు తరలివచ్చి ఓటు హక్కు వినియోగం
- వెబ్‌క్యాస్టింగ్, సీసీటీవీ ద్వారా పోలింగ్‌ను పర్యవేక్షించిన కలెక్టర్, సీపీ
- పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన బీజేపీ ఎంపీ అభ్యర్థి అర్వింద్
- పోలింగ్ సెంటర్ల వద్ద పోలీసుల భారీ బందోబస్తు

నిజామాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ భారీ బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. ఉదయం నుంచి పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఎండలను దృష్టిలో పెట్టుకొని ఎక్కువ మంది ఓటర్లు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 1గంటలోపే ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌లో యువ ఓటర్లతో పాటు వృద్ధుల వరకు కుటుంబాలతో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహిళలే ఎక్కువ శాతం క్యూలైన్‌లో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్‌లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కలెక్టర్, సీపీ, జిల్లా సెషన్ జడ్జితో పాటు మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులందరూ ఈ ఎన్నికల్లో ఓటు వేశారు. బోధన్ , నిజామాబాద్‌లో చిన్న చిన్న ఘటనలు మినహా పోలింగ్ మొత్తం ప్రశాంతంగా ముగిసింది. ఇందల్వాయి మండలం సిర్నాపల్లి గ్రామం పరిధిలోని రాంసాగర్ తండా వాసులు తమ సమస్యలు పరిష్కరించేంత వరకూ ఓటు వేయమని నిరాకరించినా.. అధికారులు, ప్రజాప్రతినిధుల హామీలతో ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ విధుల్లో ఉన్న ధర్పల్లి వీఆర్‌ఏ అస్వస్థతకు గురై చనిపోయారు.

1808 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్

పార్లమెంట్ పరిధిలోని 1808 పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు ప్రశాంతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. పార్లమెంట్ పరిధిలో ఉదయం 7గంటల నుంచి 9గంటల వరకు 10.09 శాతం పోలింగ్ జరిగింది. తర్వాత పుంజుకొని 11 గంటల వరకు 28.26 శాతం పోలింగ్ అయింది. అధికారులు, ప్రజాప్రతినిధుల పిలుపు మేరకు పోలింగ్ కేంద్రాలకు వచ్చిన ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మధ్యాహ్నం 1గంట వరకు పార్లమెంట్ పరిధిలో 45.67 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం కొంత మందగించినా 3గంటల వరకు 58.70 శాతం పోలింగ్ అయింది. సాయంత్రం 5గంటల వరకు 67.96 శాతం పోలింగ్ నమోదైంది. నియోజకవర్గాల వారీగా పరిశీలిస్తే పోలింగ్ శాతం కూడా కొంత మేర పెరిగింది. మొత్తమ్మీద ఈసారి పార్లమెంట్ ఎన్నికల్లో 71.47 పోలింగ్ శాతం నమోదైంది.

పోలింగ్ కోసం భారీ బందోబస్తు..

పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును కొనసాగించారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు 144 సెక్షన్‌ను విధించారు. అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో కేంద్ర బలగాలతో పాటు రాష్ట్ర పోలీసులను ఉపయోగించారు. వెబ్‌కాస్టింగ్, సీసీ కెమెరాలను ఉపయోగించి పోలింగ్ ప్రశాంతంగా జరిగే విధంగా చూశారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లను కొనసాగించారు. పోలింగ్ ముగిసేంతవరకూ పోలీసులు బందోబస్తు కొనసాగించారు. ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఒక మహిళ కానిస్టేబుల్ ఉండే విధంగా చూడటంతో పాటు పెట్రోలింగ్ బృందాలను నియమించారు. సీపీ కల్మేశ్వర్ సింగనెవార్ సైతం పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

జోరుగా క్రాస్ ఓటింగ్..

ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరిగింది. కొన్ని రాజకీయ పార్టీలకు చెందిన నేతలు కూడా ప్రస్తుత రాజకీయాలను బట్టి క్రాస్ ఓటింగ్‌కు కొన్ని ప్రాంతాల్లో సహకరించారు. రెండు జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌లకు ఈ క్రాస్ ఓటింగ్ ఎక్కువగా కొనసాగింది. కొన్ని వర్గాల ఓట్లు ఒక పార్టీకే గంపగుత్తగా వస్తాయని ప్రచారంతో మరి కొన్ని వర్గాల ఓట్లు ఇంకొక పార్టీకి ఎక్కువ మొత్తంలో పడ్డాయి. ఈ దఫా స్వతంత్రులు, రిజిస్టర్ పార్టీల అభ్యర్థులు ఉన్నా ఎక్కువగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌కే ఓట్లు పడ్డాయి. క్రాస్ ఓటింగ్ ఎక్కువగా జరగడం వల్ల బీజేపీతో పాటు కాంగ్రెస్‌లో కొంత జోష్ కనిపించినా అది ఎవరికి లాభిస్తుందోనన్న చర్చ మొదలైంది. కొన్ని చోట్ల బీఆర్‌ఎస్‌కు చెందిన ఓటర్లు కూడా రెండు జాతీయ పార్టీల వైపు మొగ్గు చూపడం వల్ల ఈ దఫా ఫలితాల్లో కూడా భారీ తేడా ఉండే అవకాశం కనిపిస్తుంది. శాసనసభ ఎన్నికల్లకు భిన్నంగా ఈ పోలింగ్ కొనసాగింది. ఫలితాలు కూడా భిన్నంగానే వస్తాయని పోటీలో ఉన్న అభ్యర్థులు భావిస్తున్నారు.

పోలింగ్‌ను పర్యవేక్షించిన కలెక్టర్..

పార్లమెంట్ పరిధిలో జరిగే పోలింగ్ ప్రక్రియను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పర్యవేక్షించారు. మొదట ఓటు హక్కును వినియోగించుకున్న ఆయన పార్లమెంట్ పరిధిలోని కొన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కలెక్టరేట్ నుంచి వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించడంతో పాటు పలు సూచనలను చేశారు. ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పోలింగ్ సక్రమంగా జరిగే విధంగా చూశారు. పూర్తిస్థాయిలో ఏర్పాట్లను చేయడంతో పాటు పెట్రోలింగ్ టీమ్, మైక్రో అబ్జర్వర్లు, నోడల్ అధికారులు, సెక్టోరియల్ అధికారులతో మాట్లాడుతూ ఎక్కడా పోలింగ్‌కు ఇబ్బంది లేకుండా చూశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటు చేయడంతో పాటు ప్రశాంతంగా పోలింగ్ జరిగే విధంగా చూశామని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు.

అధికారులను నిలదీసిన అర్వింద్..

నగరంలోని ఖిల్లా రోడ్‌లోని గోల్డెన్ జూబ్లీ పాఠశాలలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన ఎంపీ అర్వింద్ అక్కడి పోలింగ్‌ను పరిశీలించారు. మైనార్టీ మహిళలు బుక్కా తీయకుండా ఓటు వేయడాన్ని అధికారులను ప్రశ్నించారు. మొఖం చూడకుండా ఓటు వేసేందుకు ఎలా అనుమతించారని ఆయన అధికారులను అడి గారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలకు అనుగుణంగా ఫేస్ ఐడెంటిఫై చేసిన తర్వాతనే ఓటు హక్కును వినియోగించుకునే విధం గా చూడాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ ఉన్నా ఎక్కువ మంది లోపలికి ఎలా వచ్చారని అధికారులను అడగడంతో పాటు బందోబస్తు సక్రమంగా చేయాలని కోరారు.


• ఓటు వేసేందుకు వెళ్తున్న వృద్ధుడు


• జగిత్యాలలో ఓటు వేసిన జీవన్‌రెడ్డి


పోలీసులతో మాట్లాడుతున్న అర్వింద్


• నగరంలో బారులు తీరిన ఓటర్లు


• ఈవీఎంలను సెంటర్లకు తరలిస్తున్న సిబ్బంది





అర్బన్‌లో పెరిగిన పోలింగ్ శాతం

- గత ఎన్నికలకంటే కాస్త మెరుగ్గా..
- రెండు వర్గాలుగా ఓటింగ్ సరళి
- పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల సెల్ఫీల సందడి

నిజామాబాద్ అర్బన్, మే 13: నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ శాతం గత పార్లమెంట్ ఎన్నికలకంటే కాస్త మెరుగైంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ అర్బన్‌లో 56.25 శాతం పోలింగ్ నమోదు కాగా సోమవారం జరిగిన పోలింగ్‌లో సాయంత్రం 5గంటల వరకు నిజామాబాద్ అర్బన్‌లో 57.86 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 6గంటల వరకు పోలింగ్ సమయం పెంచడంతో పోలింగ్ శాతం కొంత పెరిగే అవకాశాలు ఉన్నాయి. ఉదయం నుంచి పోలింగ్ మందకొడిగానే సాగింది. ఉదయం 9గంటల వరకు 10.35 శాతం, 11గంటల వరకు 23.04 శాతం, మధ్యాహ్నం 1గంట వరకు 38.68 శాతం, మధ్యాహ్నం 3గంటలకు 49.57 శాతం, సాయంత్రం 5గంటల వరకు 57.86 శాతం ఓటింగ్ నమోదైంది. నిజామాబాద్ అర్బన్‌లో మొత్తం 3 లక్షల 4వేల 317 మంది ఓటర్లు ఉండగా పోలింగ్ శాతం గత ఎన్నికలకంటే కొంత పెరిగే అవకాశం ఉంది. గత పా ర్లమెంట్ ఎన్నికల్లో 56.25 శాతం ఓటింగ్ నమోదు కాగా, ఒక లక్షా 51వేల 2 ఓట్లు పోల్ అయ్యాయి.

రెండు వర్గాలుగా సాగిన ఓటింగ్ సరళి..

నిజామాబాద్ అర్బన్‌లో గత ఎన్నికలకు భిన్నంగా ఓటింగ్ సరళి సాగినట్లు తెలుస్తోంది. రెండు జాతీయ పార్టీల మధ్య ప్రధానంగా పోటీ జరిగినట్లు ఓటింగ్ సరళిని బట్టి అర్థమవుతుంది. ఒక వర్గం ఓట్లు ఒక పార్టీకే పడగా మరోవర్గం ఓట్లు మరో పార్టీకి పడినట్లు తెలుస్తుంది. ఒక వర్గం ఓట్లు భారీగా పోల్ కాగా మరో వర్గం కూడా దీటు గా ఓట్లు వేసినట్లు సమాచారం. గతంలో ఎన్నడులేని విధంగా రెండు ప్రధాన పార్టీల మధ్య పోటీ జరిగింది.

పోలింగ్ కేంద్రాల వద్ద సెల్ఫీల సందడి..

నగరంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు. ఓటర్లలో ఓటుపై చైతన్యం కలిగించేందుకు ఎన్నికల సంఘం పోలింగ్ కేంద్రాలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దారు. మహిళా పోలింగ్ కేంద్రాలు, యువత పోలింగ్ కేంద్రాలు, వికలాంగుల పోలింగ్ కేంద్రాలు, ఆదర్శ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద బెలూన్‌లు, ఇతరత్ర అలంకారణలతో తీర్చిదిద్దారు. ఓటర్లు తాము ఓటు వేసినట్లు సెల్ఫీలు దిగుతూ పోలింగ్ కేంద్రాల వద్ద సందడి చేశారు.




• నగరంలో ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్స్

ఓటు వేసిన ట్రాన్స్‌జెండర్స్

నిజామాబాద్ అర్బన్, మే 13: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ నగరంలోని నాగారం 300 క్వాటర్స్ ప్రభుత్వ పాఠశాలలో 198, 199 బూత్‌లలో, చంద్రశేఖర్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో ట్రాన్స్‌జెండర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లోనూ ట్రాన్స్‌జెండర్స్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

అమెరికా నుంచి ఓటు వేయడానికి..

నగరంలోని మారుతినగర్‌కు చెందిన తుమ్మల సాయిసిద్ధాంత్‌రెడ్డి ఎంపీ ఎన్నికల్లో ఓటు వేయడానికి అమెరికా నుంచి వచ్చాడు. అమెరికాలోమాస్టర్స్ చదువుతున్న సిద్ధాంత్‌రెడ్డి మొదటిసారి ఓటు వేసేందుకు వచ్చాడు. నగరంలోని ఎస్‌ఆర్ పాఠశాలలో తన ఓటు హక్కును వినియోగించుకున్నాడు.



సీపీ పర్యవేక్షణలో భారీ బందోబస్తు

ఖిల్లా, మే 13: పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీసు కమిషనర్ కల్మేశ్వర్‌శింగనేవార్ పటిష్ఠ చర్యలు తీసుకున్నారు. సోమవారం 7గంటలకు మొదలయిన పోలింగ్‌ను సీపీ స్వయంగా పర్యవేక్షించారు. పోలింగ్ సందర్భంగా ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌లకు సుమారు 100మీటర్ల దూరంలోనే సిబ్బందిని నియమించి వాహనాలు లోనికి రాకుండా అన్ని చర్యలు తీసుకున్నారు. ఖిల్లా రోడ్డు, మాలపల్లి, ముజాహిద్‌నగర్, హబీబ్‌నగర్‌లో రోడ్లపై ఐదుగురి కంటే ఎక్కువ మంది ఉండడంతో వారిని చెదరగొట్టారు. రెండు చోట్ల నలుగురిని అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎప్పటి కప్పుడు వివరాలను సిబ్బంది ద్వారా తెలుసుకున్నారు. పోలీసు కమిషనర్‌తో పాటు నిజామాబాద్ ఏసీపీ రాజ వెంకట్‌రెడ్డి సైతం సిబ్బందితో పోలింగ్‌బూత్‌ల వద్ద ఎటువంటి ఘటనలు జరగకుండా పరిశీలించారు. పోలింగ్ సమయంలో నగర ఇన్స్‌పెక్టర్లు నరహరి, డి.విజయబ్‌బాబు, ఎస్‌ఐలు, ప్రత్యేక పోలీసు సిబ్బందితో పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించారు. ఎటువంటి చెదురుముదురు ఘటనలు కూడా జరగకుండా గట్టి బందోబస్తు నిర్వహించారు.

ఈవీఎంలతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లకు చేరుకున్న బస్సులు


విజయమేరీ పాఠశాల ప్రాంగణానికి చేరుకున్న బస్సులు

బోధన్ రూరల్, మే 13: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బోధన్ పట్టణంలోని విజయమేరి పాఠశాల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో అధికారులతో ఈవీఎంలు ఆదివారం సాయంత్రం చేరుకున్నాయి. ఎన్నికల సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాలకు అధికారులతో సహా తరలివెళ్లాయి. సోమవారం సాయంత్రం గ్రామాలలో ఎన్నికలు ముగిసిన అనంతరం తిరిగి బోధన్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకున్నాయి. 246పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన ఈవీఎంలు విజయమేరి పాఠశాలలో భద్రపర్చగా ఎన్నికల నేపథ్యంలో ఆయా సెంటర్‌లకు బస్సులలో ఈవీఎంలను తరలించారు. సోమవారం సాయంత్రం ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఈవీఎం బస్సులు విజయమేరి పాఠశాలకు చేరుకున్నాయి. అనంతరం ఈవీఎం బస్సులను పోలీసులు భారీ బలగాలతో డిచ్‌పల్లిలోని సీఎస్ఐ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపర్చు కేంద్రానికి తీసుకువెళ్లనున్నారు. సుమారు 50నుండి 60బస్సుల వరకు ఈవీఎంలలో తరలివెళ్తాయని ఎన్నికల అధికారులు తెలిపారు.

ప్రియం.. ప్రియం.. నాటుకోడి!

● కొవ్వు నిల్.. పోషకాలు ఫుల్ ● గ్రామీణ ప్రాంతాల్లో పెరిగిన కోళ్ల పెంపకం ● లైవ్ కిలో రూ.550
● కొనేందుకు ఆసక్తి చూపుతున్న మాంసం ప్రియులు ● కుటీర పరిశ్రమగా మలుచుకుంటున్న గ్రామీణులు
● నిజామాబాద్ జిల్లాలో ప్రతీరోజు వేలల్లో నాటుకోడి విక్రయాలు

నందిపేట, మే 13: నాటుకోడి మాంసానికి రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. కొవ్వు శాతం తక్కువగా ఉండడం, పోషకాలు అధికంగా ఉండడంతో నాటుకోడి మాంసం తినేందుకు చాలా మంది ఇష్టపడుతున్నారు. బ్రాయిలర్ కోడి, మటన్‌లతో పోలిస్తే నాటుకోడే ఆరోగ్యానికి మేలని వైద్యులు పేర్కొనడమే ందుకు కారణం. కోడి ధర ఘాటెక్కినా రుచి మాత్రం భలే హాటు అంటూ మాంసాహారులు లొట్టలు వేసుకొని తింటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది నాటుకోళ్ళ పెంపకాన్ని కుటీర పరిశ్రమగా మార్చుకుంటున్నారు. జిల్లాలో ముఖ్యంగా ఆర్మూర్, బాల్కొండ, నిజామాబాద్ రూరల్, అర్బన్ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో ప్రతీ రోజు నాటుకోళ్ళ విక్రయాలు రూ.లక్షల్లో జరుగుతున్నాయి. నాటుకోళ్ల వ్యాపారం టాప్ లెవల్లో దూసుకుపోతోంది. నాటుకోడి మాంసం అంటే చాలు మాంసాహారులు లొట్టలు వేసుకుంటున్నారు. ఇవి సహజ సిద్దంగా పెరగడంతో వీటిని తినందుకు చాలామంది ఇష్టపడుతున్నారు. అంతే కాకండా నాటుకోడి బరువులు పెరగడానికి ఏలాంటి ఇంజక్షన్లు ఇవ్వకపోవడం, వీటికి ఆహారంగా బియ్యం, మొక్కజొన్న, జొన్న గింజలు వేయడంతోనే బరువు పెరుగుతున్నాయి. దీంతో నాటుకోడి కూర, పులుసు అంటే మాంసాహారులు పడి చస్తున్నారు. మరోవైపు నాటుకోళ్లలో పోషకాలు అధికమని, కొవ్వు శాతం తక్కువ మోతాదులో ఉంటుందని వైద్యులు సూచిస్తుండడంతో ఇటీవల నాటుకోడికి విపరీతమైన డిమాండ్ పెరిగింది. దీంతో కోడి మాంసం ధర ఘాటెక్కినా రుచి మాత్రం భలే పసందు అంటున్నారు మాంసం ప్రియులు.

● సహజ సిద్ధమైన వాతావరణంలో..

నాటుకోళ్ల పెంపకం కోసం ఎలాంటి ఖర్చు పెట్టాల్సిన అవసరం లేదు. కేవలం మన ఇంటి ముందు కాస్త ఖాళీ స్థలం ఉంటే చాలు. వాటికి ఎలాంటి దాణా కానీ, మందులు, ఇంజక్షలు ఇచ్చే అవసరం లేదు. సహజ సిద్దంగా లభించే గింజలు, చిన్న చిన్న క్రిములను ఆహారంగా తీసుకొని పెరుగుతున్నాయి. ప్రస్తుతం ప్రతీ పల్లెటూరిలో సైతం మటన్, చికెన్ షాపులు వెలిశాయి. కోరుకున్న సమయంలో అనుకున్నంత మాంసం లభించడంతో నాటుకోళ్ళ పెంపకం కొద్దిగా తగ్గుముఖం పట్టింది. దీంతో ధర అమాంతం పెరిగిపోయింది.

నాటుకోడి మాంసం విక్రయిస్తున్నాం
: ఏనుగుల పోశాగౌడ్, అర్డర్ మెస్ నిర్వాహకులు, నందిపేట



బ్రాయిలర్ చికెన్ కంటే నాటుకోడి కావాలని అడుగుతున్నారు. కస్టమర్ల డిమాండ్ మేరకు గ్రామాల్లో నుంచి కోళ్ళను కొనుక్కోస్తున్నాను. ఒక నాటు కోడి కిలో రైస్‌కు రూ.550 తీసుకుంటున్నా. రోజునా ఆర్డర్ మెస్‌లోనే 10 కోళ్ళకు పైగా విక్రయిస్తున్నా. నాటుకోడి లేకుంటే గిరాకీ వాపస్ పోతోంది. బ్రాయిలర్ తినమంటే అలవాటు లేదంటున్నారు.

● మాంసంలో కొవ్వు నిల్

నాటుకోడి మాంసంలో కొవ్వు శాతం పూర్తిగా తక్కువగా ఉండడం, పోషకాలు అధికంగా ఉండడంతో వైద్యులు నాటుకోడి మాంసం తినడం మంచిదని చెబుతున్నారు. బ్రాయిలర్ కోడి, మటన్‌లతో పోలిస్తే నాటుకోడి ఆరోగ్యానికి మేలని తెలుసుకున్న మాంసాహారులు నాటు మాంసంపై మక్కువ చూపుతున్నారు. రుచిలో కూడా నాటుకోడి కూర, పులుసు నోరూరిస్తోంది. ఈ మాంసం తినేవారి సంఖ్య రోజురోజుకు పెరిగిపోతోంది.

● లైవ్ కిలో రూ.550 మాత్రమే..

గ్రామీణ ప్రాంతాల్లో నాటుకోడి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఏకంగా మటన్ ధరతో సమానంగా తూగుతోంది. మటన్ ధర కిలో రూ.600 నుంచి 700 పలుకుతోంది. నాటుకోడి ధర లైవ్ కిలో రూ.550కి చేరింది. ఈ లెక్కన డ్రెస్‌డు నాటుకోడి మాసం కిలోకు రూ. 650 వరకు పలుకుతోంది. రెస్టారెంట్, పర్మిట్ రూం, దాబా హోటళ్ళలో ఒక నాటుకోడి కూర, పులుసు ధర రూ.900 నుంచి రూ.1000 వరకు వెళ్తోంది.

● కుటీర పరిశ్రమగా మారుతున్న తీరు

నాటుకోడి మాంసానికి పెరుగుతున్న ఆధరణ చూసి మళ్ళీ గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది ఇళ్ళలో కోళ్ళను పెంచుటున్నారు. పట్టణ ప్రాంతాలలో సైతం కొంత మంది పెరటి కోళ్ళను పెంచుకుంటున్నారు. ఒక నాటుకోడి దాదాపు కిలో నుంచి కిలోన్నర బరువు పెరగాలంటే ఆరు నెలల సమయం పడుతోంది. మార్కెట్లో వీటికి ఉన్న డిమాండును చూసి పెద్దఎత్తున్న కోళ్ళ పెంపకాన్ని గ్రామీణులు చేపడతున్నారు. ఒక్కోక్క ఇంట్లో ఇరువై నుంచి ముప్పై కోళ్ళు పెంచుతున్నారు. వాటికి పిల్లలు పుట్టినా కొద్ది 750గ్రాములు, కిలో బరువున్న కోళ్ళను వ్యాపారులకు, హోటల్ వారికి విక్రయిస్తున్నారు. జిల్లాలో చికెన్ సెంటర్లలో నాటుకోడి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నందిపేట, ఆర్మూర్, బాల్కొండ, నవీపేట జరిగే వారాంతపు సంతలో నాటుకోళ్ళ విక్రయాలు భారీగా జరుగుతున్నాయి.

● పెరటి కోళ్ల పెంపకం

ఇటీవల కొందరు నిరుద్యోగులు పౌల్ట్రీ ఫారాలను అద్దెకు తీసుకొని పెరటి కోళ్ళను పెంచుతున్నారు. గ్రామాల్లో పెరుగుతున్న పెరటి కోళ్ళను సంతలలో విక్రయిస్తున్నారు. కొందరైతే నేరుగా దాబా హోటళ్ళకు సరఫరా చేస్తున్నారు. ఏదీ ఏమైనప్పటికి నిజామాబాద్ జిల్లాలో నాటుకోడి విక్రయాలు టాప్ లెవల్‌లో దూసుకుపోతున్నాయి.


నందిపేటలో అమ్మకానికి సిద్ధంగా ఉన్న నాటుకోళ్లు


ఆర్డర్ మెస్‌లో నాటుకోళ్లను వండుతున్న దృశ్యం

ఓటు హక్కును వినియోగించుకున్న ప్రముఖులు

నిజామాబాద్, మే 13 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు తమ కుటుంబాలతో తరలివచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి టి.జీవన్‌రెడ్డి జగిత్యాల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి ఎంపీ అర్వింద్ నిజామాబాద్‌లోని కాకతీయ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ సిరికొండ మండలం రావుట్లలో తన కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఈ ఎన్నికల్లో రాజ్యసభ సభ్యుడు కెఆర్ సురేష్‌రెడ్డి కమ్మర్‌పల్లి మండలం చౌట్‌పల్లిలో ఓటు వేశారు. బోధన్ ఎమ్మెల్యే మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి తన స్వగ్రామం సిరాన్‌పల్లిలో ఓటు వేశారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తన కుటుంబ సభ్యులతో కలిసి మిర్చికంపౌండ్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటును వినియోగించుక్నున్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గూపన్‌పల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అంకాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. బాల్కొండ ఎమ్మెల్యే మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి వేల్పూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ గోల్‌హనుమాన్ వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో ఓటు వేశారు. అంతేకాకుండా జిల్లా సెషన్ జడ్జి కుంచాల సునీత బాలసదన్‌లో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నగర సీపీ కల్మేశ్వర్ సింగన్‌వార్ కూడా బాలసదన్‌లోనే ఓటు వేశారు. మాజీ మంత్రి మండవ వెంకటేశ్వరరావు ధర్మారం(బి) గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్త కుటుంబ సభ్యులతో కలిసి గంగాస్థాన్‌లో ఓటు వేయగా మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అంకాపూర్‌లో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు.


ఓటు హక్కును వినియోగించుకున్న నిజామాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అర్వింద్


ఓటు హక్కును వినియోగించుకున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్దన్


ఓటు వేసినట్లు చూపుతున్న కాంగ్రెస్ నేత మహేష్‌కుమార్‌గౌడ్


ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్యే బిగాల

ఓటు వేసేందుకు వచ్చి వృద్ధురాలు మృతి

కోటగిరి,మే13: పొతంగల్ మండల కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చి శ్రీగంధం గిర్మవ్వ(83)అనే వృద్దురాలు మృతి చెందింది. గిర్మవ్వ 21వ పోలింగ్ బూత్‌లో ఓటు వేసేందుకు వచ్చింది. పోలింగ్ కేంద్రం ఆవరణలో స్పృహ తప్పి పడిపోవడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందింది. ఈ విషయమై ఎస్ఐ సందీప్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.


● మృతురాలు గిర్మవ్వ

'బీఆర్ఎస్ ఓడిపోతామన్న భయం'



చందూరులో విలేకరులతో మాట్లాడుతున్న ఏనుగు రవీందర్ రెడ్డి

వర్ని,మే13: ఓడిపోతున్నామన్న భావనతో బీఆర్ఎస్ పార్టీ వారు బీజేపీ పార్టీ వారి మద్దతు కోరడం దురదృష్టకరమని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. చందూర్ మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా ప్రజలు కాంగ్రెస్ నాయకత్వాన్నే బాన్సువాడలో కోరుకుంటున్నారని స్పష్టం చేశారు. 2004లో మధుయాష్కి, బాజిరెడ్డి గోవర్ధన్‌లకు అవకాశం కల్పించిన తరహాలో 20ఏళ్ల అనంతరం కాంగ్రెస్‌కే ఎంపీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆరు గ్యారంటీల అమలు కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఆగస్టు 15లోపు రైతుల రుణ మాఫీ చేయడం తథ్యమని భరోసా ఇచ్చారు. సమావేశంలో నాయకులు యలమంచిలి శ్రీనివాస్ రావు, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, కల్లూరి రామిరెడ్డి, అశోక్ రెడ్డి, భూమిరెడ్డి, శేఖర్‌యాదవ్ పాల్గొన్నారు.

పోలింగ్ సరళి పరిశీలన



నవీపేటలో మాట్లాడుతున్న బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి

నవీపేట,మే13: మండలంలోని వివిధ గ్రామాలలో జరిగిన పోలింగ్ సరళిని బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి ఆయేషా ఫాతిమా పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులను కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపు గురించి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో పలువురు మండల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

● బీజేపీ నాయకుల పరిశీలన

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి సోమవారం మండలంలోని వివిధ గ్రామాలలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ అభ్యర్థి గెలుపు గురించి కార్యకర్తల నుంచి వివరాలను వాకబు చేశారు. అంతకు ముందు ఆయన తన స్వగ్రామమైన మోకన్‌పల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.


ఓటు హక్కు వినియోగించున్న సునీల్‌కుమార్



సావెల్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న సునీల్‌కుమార్

మెండోర, మే13: బాల్కొండ మండలం సావెల్ గ్రామంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సోమవారం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు హక్కును ప్రతీఒక్కరు వినియోగించుకోవాలని అన్నారు.

ఓటు వేసిన కాసుల బాలరాజు



ఓటు వేసిన ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్

బాన్సువాడటౌన్, మే 13: రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మెన్ కాసుల బాల్‌రాజ్ సోమవారం తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బాన్సువాడ మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఓటు వేశారు.


నవీపేట మండలంలో 68.84శాతం పోలింగ్



నవీపేట పోలింగ్ కేంద్రంలో గేటు మూసివేస్తున్న పోలీసులు

నవీపేట,మే13: సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలలో భాగంగా నవీపేట మండలంలో 68.84శాతం పోలింగ్ నమోదైంది. మండలంలో 54 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. మండలంలో 46,192మంది ఓటర్లు ఉండగా వీరిలో 21,499మంది పురుషులు, 24,693మంది స్త్రీలు ఉన్నారు. ఉదయం 7గంటల నుండి సాయంత్రం 6గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. సాయంత్రం 6గంటలకు పోలింగ్ కేంద్రాల గేట్లను పోలీసులు మూసివేశారు. నవీపేట జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో కొనసాగిన పోలింగ్ కేంద్రంలో సాయంత్రం 6గంటలకు సీఐ శ్రీనివాస్ రావు, ఎస్ఐ యాదగిరి గౌడ్, ఏఎస్ఐ మోహన్ రెడ్డితో పాటు పోలీసు సిబ్బంది ఓటింగ్ సమయం ముగిసిన తర్వాత ప్రధాన గేటును మూసివేశారు. సాయంత్రం 6గంటల తర్వాత ఒకరిద్దరు ఓటర్లు ఓటు వేయడానికి వచ్చినప్పటికీ సమయం దాటి పోవడంతో పోలీసులు వారికి వెనక్కి పంపించారు.

పోలింగ్ కేంద్రాల వద్ద పోలీసుల భారీ బందోబస్తు



బోధన్‌లో పోలీసుల భారీ బందోబస్తు దృశ్యం

బోధన్‌రూరల్,మే13: సోమవారం పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పట్టణంతో పాటు సాలూర, బోధన్ మండలాల్లోని పోలింగ్ కేంద్రాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు బోధన్ ఏసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. 144సెక్షన్ ఉండడంతో ప్రజలను గుమిగూడనివ్వకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగనివ్వకుండా పటిష్ట భద్రతను ఏర్పాటు చేశారు.

గుండారంలో స్వల్ప ఉద్రిక్తత



గుండారంలో స్వల్ప ఉద్రిక్తత

నిజామాబాద్ రూరల్, మే, 13: నిజామాబాద్ జిల్లా రూరల్ మండలం గుండారంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్‌లో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. గుండారం జడ్పీహెచ్ఎస్ పాఠశాల సమీపంలో గుంపులుగా ఉన్న జనాన్ని చూసి ట్రైనీ ఐపీఎస్ అధికారి చైతన్యరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్కడి నుంచి వెళ్లిపోవాలని సూచించినా స్పందించక పోవడంతో ఆగ్రహంతో ఊగిపోయారు. గుంపులను చెదరగొట్టారు. బీజేపీ నేత గుండారం ఉపసర్పంచ్ శంకర్‌రెడ్డి వాదనకు దిగారు. పోలీసు జీప్ ఎక్కమని ఆదేశించడంతో తాను ఓటువేసి పోలీసు స్టేషన్ వస్తానని వాగ్వాదానికి దిగారు. ఓటు వేసిన అనంతరం రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్లి సరెండర్ అయ్యారు. దాంతో బీజేపీ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్‌కు ఫిర్యాదుచేశారు. దాంతో ఆయన కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో మాట్లాడిన తర్వాత శంకర్ రెడ్డిని వదిలిపెట్టారు. ఆకుల కొండూరు గ్రామంలో యువకులతో ట్రైనీ ఐపీఎస్ అధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా మాజీ సర్పంచ్ అశోక్‌తో వాగ్వాదానికి దిగారు. మల్కాపూర్ (ఏ)లో సైతం ఇలాంటి ఘటనలు జరిగాయి.

గుట్టు చప్పుడు కాకుండా మొరం అక్రమ రవాణా



బాల్కొండలో అక్రమంగా మొరం తరలిస్తున్న దృశ్యం

ముప్కాల్, మే13: బాల్కొండ మండలంలో మొరం అక్రమ రవాణా గుట్టు చప్పుడు కాకుండా కొనసాగుతుంది. సెలవు దినాలతో పాటు ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల నిర్వహణలో నిమగ్నమై ఉన్నారని అలుసుగా తీసుకొని మొరం వ్యాపారస్తులు రాత్రి, పగలు తేడా లేకుండా బాల్కొండ మండల కేంద్రం నుంచి అందినంత దోచుకుంటున్నారు. పనిదినాల్లో అయితే ప్రభుత్వానికి చలాన్ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, మొరం వ్యాపారులు ఎన్నికలను అసరగా చేసుకొని మొరం గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నరు. గత రెండు, మూడు రోజుల నుంచి మొరం తరలిస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదు. మొరం అక్రమ రవాణాపై, తహసీల్దార్ అధికారులను, ఇరిగేషన్ అధికారులను ఫోన్‌లో సంప్రదించగా మేము ఏటువంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు.ఎలక్షన్ నిర్వహణలో ఉన్నామని పేర్కొనడం గమనార్హం. అక్రమ మొరం తరలింపులో అధికారుల ప్రమేయం ఉందన్న అనుమానాలు రెకెత్తుతున్నాయి. మొరం తరలిస్తూ మొరం వ్యాపారులు మాత్రం తమకు ఏటువంటి నిబంధనలు పట్టనట్టుగా మూడు ట్రాక్టర్‌లు, ఆరు టిప్పర్‌లుగా వ్యాపారం కొనసాగిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మొరం అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని కోరారు..

తమ సమస్యలు పరిష్కరించేంతవరకు ఓటు వేసేది లేదని ఆందోళన



ఓటు వేయబోమని కూర్చున్న రాంసాగర్ తాండా వాసులు

ఇందల్వాయి, మే 13: పార్లమెంట్ ఎన్నికలు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉదయం 7గంటలకే మొదలవగా సిర్నాపల్లి గ్రామంలో గల రాంసాగర్ తాండా వాసులు తమ సమస్యలు పరిష్కరించేంతవరకు ఓట్లు వేయమని బీష్మించుకొని కూర్చున్నారు.అధికారులు, ప్రజా ప్రతినిధులు తమకు స్పష్టమైన హామీ ఇస్తేనే తామంతా ఓటు హక్కు వినియోగించుకుంటామని ఓ చెట్టుకింద సమావేశమయ్యా రు. గత పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సిర్నాపల్లి గ్రామ పరిధిలోని రాంసాగర్ తాండాలో ఓ ప్రత్యేక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడంతో తమ ప్రధాన సమస్యలైన రోడ్లు, వీధిదీపాలు, డ్రైనేజీలు, పక్కా ఇండ్లు వీటిలో ఏవీ కూడా నెరవేర్చడం లేదని ఈసారి తాండాలోని ఎవరూ కూడా ఓటు వేయమంటూ తాండావాసులు ఒకచోట సమావేశమై కూర్చున్నారు. సుమారు రెండు గంటల వరకు పోలింగ్ బూత్‌కు ఒక్క ఓటరు కూడా రాకపోవడంతో ఎన్నికల అధికారులు వేచి చూసి చేసేదేమి లేక పోలింగ్ స్టేషన్ నుంచి బయటకు వచ్చి బయట కూర్చున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు మునిపల్లి సాయిరెడ్డి, మాజీ ఎంపీపీ ఇమ్మడి గోపి రాంసాగర్ తండాకు వెళ్లి తాండావాసులతో చర్చలు జరిపి ఎన్నికలు పూర్తయిన వెంటనే తాండాకు రోడ్లు, వీధి దీపాలను వేయిస్తానని హామీ ఇవ్వడంతో రెండుగంటల 40 నిమిషాల తర్వా త ఓట్లు వేసేందుకు తండా వాసులు పోలింగ్ కేంద్రానికి వచ్చారు. ఈ పోలింగ్ బూత్‌లో మొత్తం 110 ఓట్లు ఉన్నాయని స్థానికులు తెలిపారు. ఈ సారి తమ సమస్యలను తీర్చకుంటే రానున్న ఎన్నికల్లో ఏ నాయకుడిని కూడా తాండాకు రానిచ్చేది లేదని తమ ఓటు హక్కు వినియోగించుకోమని తెలిపారు.

కమ్మర్‌పల్లిలో ఓటింగ్ సరళి పరిశీలన



ఉప్లూర్‌లో ఓటింగ్ సరళిని అడుగి తెలుసుకుంటున్న బాల్కొండ ఎమ్మెల్యే

కమ్మర్‌పల్లి, మే 13: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా కమ్మర్‌పల్లి మండలంలోని పలుగ్రామాలలో సోమవారం పర్యటిస్తూఓటింగ్ సరళిని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. మండలంలోని పలుగ్రామాల్లో కార్యకర్తలద్వారా ప్రతీ రెండు గంటలకు సంబంధించిన పోలింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలకేంద్రలోని పార్టీ కార్యాలయంలో కూర్చొని మండల నాయకులు, కార్యకర్తలతో ముచ్చటించారు. మండల ఎంపీపీ లోలపు గౌతమి, మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, గ్రామ మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, రైతులనాయకులు బద్దం రాజేశ్వర్, బద్దం చిన్నారెడ్డి, బద్రి, కోరె నర్సయ్య, సుమన్, హల్దె శ్రీనివాస్, ఏనెడ్ల రవిందర్, అవారి మురళి, మహిళ కార్యకర్తలు ఉన్నారు.

● పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే పోచారం

కోటగిరి, మే 13: కోటగిరి ఉమ్మడి మండలంలో జహీరాబాద్ పార్లమెంట్ పోలింగ్ సరళిని సోమవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. కోటగిరి, జల్లాపల్లి ఫారం, ఆబాదీ, పొతంగల్ మండల కేంద్రాల్లో పోలింగ్ కేంద్రాలలో వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి



మృతుడు మహమ్మద్ సాధక్

ధర్పల్లి, మే 13: మండలానికి చెందిన మహమ్మద్ సాధక్ (31) వీఆర్ఏ గుండెపోటుతో మృతి చెందాడు. తహశీల్దార్ కార్యాలయంలో ఒన్నాజిపేట్ వీఆర్ఏగా పనిచేస్తున్న సాధక్ వారం రోజుల నుంచి ఎన్నికల విధినిర్వహణలో భాగంగా డిచ్‌పల్లి సీఎంసీలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఆదివారం రాత్రి సాధక్ ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో అతన్ని మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు. సాధక్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నట్లు కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. సాధక్ మృతి పట్ల తహశీల్దార్ మాలతి, ఆర్ఐ రవి తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామన్నారు. సాధక్ మృతి చెందిన విషయాన్ని జిల్లా కలెక్టర్‌కు తహశీల్దార్ మాలతి ఫోన్‌లో వివరించారు. తక్షణ సహాయం కింద తహశీల్దార్ రూ.20వేలు, ఆర్ఐ రూ.5వేలు అందజేశారు. అందరితో కలుపుగోలుపుగా ఉండే సాధక్ మృతి చెందడంపై రెవెన్యూ సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

ఓటు హక్కును వినియోగించుకున్న సుభాష్‌రెడ్డి

ఎల్లారెడ్డి, మే 13 : పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని గర్ల్స్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆదర్శ ఓటింగ్ సెంటర్‌లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయనతో పాటు ఆయన సతీమణి, కుమారుడు, కోడలు ఉన్నారు.



ఓటు హక్కును వినియోగించుకున్న సుభాష్‌రెడ్డి

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



బైరాపూర్‌లో బారులు తీరిన మహిళా ఓటర్లు



మద్నూర్‌లో ఓటు వేసేందుకు బారులు తీరిన మహిళలు



ఎల్లారెడ్డిలో పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

వర్ని:వర్ని, చందూర్ మండలాల పరిధిలో సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. తగిలేపల్లి గ్రామంలో ఈవీఎం యంత్రం సుమారు 50నిమిషాల పాటు మొరాయించింది. దీంతో ఓటర్లు ఓటు కోసం ఎదురు చూశారు. అధికారులు యంత్రాన్ని పోలింగ్ అధికారుల సహకారంతో సరి చేశారు. ఎస్ఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తును పర్యవేక్షించారు.

మోస్రా: మండలంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఓటర్లు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకున్నారు. మండలంలో మొత్తం 10,322ఓట్లు ఉండగా 8,147మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 78.9శాతం పోలింగ్ నమోదైంది.

కోటగిరి: కోటగిరి ఉమ్మడి మండలంలో సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. కోటగిరి మండలంలోని బస్వాపూర్, కొత్తపల్లి గ్రామాలలో ఈవీఎంలు పది నిమిషాల పాటు మొరాయించడంతో అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించారు. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. ఉమ్మడి మండలంలో 53పోలింగ్ కేంద్రాలు ఉండగా 40,126మంది ఓటర్లు ఉన్నారు. సాయంత్రం వరకు పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు ఓటర్లకు వసతులు కల్పించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. కోటగిరి ఉమ్మడి మండలంలోని కోటగిరి, పొతంగల్, ఎత్తొండలో మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మహిళలు అధిక సంఖ్యలో ఓటుహక్కును వినియోగించుకున్నారు.

రుద్రూరు: పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం రుద్రూరు మండల కేంద్రంతో పాటు గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం ఎండ తీవ్రత తక్కువగా ఉంటుందని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే అధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు. అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల్లో యువత, మహిళలు, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపారు.

మోర్తాడ్: మోర్తాడ్ మండలంలో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. సోమవారం ఉదయం నుంచి గ్రామాల్లో ఓటర్లు అధిక సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. మోర్తాడ్‌లో అన్ని పోలింగ్‌స్టేషన్‌లకు దూరంలోనే వాహనాలకు ప్రవేశ లేక కేవలం కాలినడక వెళ్ళి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీ సంబంధించిన కండువలు, టెంట్లు ఏర్పాటు చేసుకోవడాన్ని అనుమతించలేదు. 4గంటల వరకు పార్టీల నాయకులు రోడ్లపై ఓటర్లను ప్రచారం చేశారు. అనంతరం పోలీసులు రోడ్లపై ఉండకూడదని చాటింపు వేశారు. ఏది ఏమైన మండలంలో ఓటర్లు ప్రశాంతంగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నందిపేట: మండలంలోని అన్ని గ్రామాల్లో సోమవారం పార్లమెంట్ ఎన్నికల ఓటింగ్ ప్రశాంతంగా జరిగింది. ఎండ తీవ్రతకు ఓటర్లు ఉదయం నుంచే బారులు తీరారు. సోమవారం వారాంతపు సంత ఉండడంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. నందిపేట మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ సరళిని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరిశీలించారు. ఈవీఎంలతో పోలింగ్ జరగడంతో కరెంటుకు అంతరాయం కలుగకుండా నందిపేట ట్రాన్స్‌కో ఏడీఈఎం.అశోక్ ఆధ్వర్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది నిరంతరం పర్యవేక్షించారు.

పిట్లం: మండలంలో సోమవారం జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినాయని ఎన్నికల అధికారి కిషన్ తెలిపారు.ఎన్నికల అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించారు.జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావ్ పిట్లంలోని 209 పోలింగ్ కేంద్రంలో ఓటు వేసినారు.

ఎల్లారెడ్డి: పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో సోమవారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంతో పాటు గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఉదయం ఎండ తీవ్రత తక్కువగా ఉంటుందని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే అధిక సంఖ్యలో ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోవడానికి బారులు తీరారు. అధికారులు పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు పకడ్బందీగా సౌకర్యాలు కల్పించారు. ఎన్నికల్లో యువత, మహిళలు, వృద్ధులు ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఎక్కువ ఆసక్తి చూపారు.

పెద్దకొడప్‌గల్: పెద్ద కొడప్‌గల్ మండలంలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని ఆయా గ్రామాలలో పోలింగ్ సిబ్బంది ఆదివారం సాయంత్రం చేరుకున్నారు.పెద్ద కొడప్‌గల్ మండల కేంద్రంలో గల పోలింగ్ కేం ద్రాన్ని బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ సందర్శించారు. డోంగ్లీ మండలం సిర్పూర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న బీబీ పాటిల్ జహీరాబాద్ వెళ్తున్న క్రమంలో పెద్దకొడప్‌గల్ మండల కేంద్రంలో ఆగిపోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం పోలింగ్ కేంద్రంలోకి చేరుకుని పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారులతో మాట్లాడి ఎన్నికలు ఎలా సాగుతున్నాయన్న విషయం తెలుసుకున్నారు. అక్కడి నుంచి పో లింగ్ కేంద్రం బయటకు వచ్చి యువకులతో సెల్ఫీలు దిగారు. ఈ కార్య క్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే గంగారాం పాల్గొన్నారు.

మద్నూర్: జహీరాబాద్ పార్లమెంట్ మాజీ ఎంపీ బీబీ పాటిల్ డోంగ్లీ మండలంలోని సిర్పూర్ గ్రామంలో కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.కుటుంబ సభ్యులతో పాటు మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

నాగిరెడ్డిపేట:నాగిరెడ్డిపేట మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 78 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాలలో పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు ఉదయం 7 గంటల నుంచి బారులు తీరారు. మండల కేంద్రంలోని గోపా ల్‌పేట్ పోలింగ్ కేంద్రాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసులు పరిశీలించారు. మండలంలో ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేవు. మండలంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.

మద్నూర్: జహీరాబాద్ పార్లమెంట్ పరిధిలోని జుక్కల్ నియో జకవర్గంలోని మద్నూర్, డోంగ్లీ ఉమ్మడి మండలాల్లో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. 22 పోలింగ్ బూత్‌లలో ఈవీఎంలు మొరాయించడంతో 8.30 గంటల తర్వాత పోలింగ్ ప్రారంభమైంది. ఓటర్లు ఉదయమే వచ్చి ఈవీఎంలు మొరాయించడంతో తిరిగి వెళ్లిపోయాయి.

బాన్సువాడ / బాన్సువాడటౌన్: బాన్సువాడ నియోజకవర్గంలో సోమవారం పార్లమెంట్ 4 వ విడత ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 258 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 26 సెక్టార్లలో 48 సమస్యాత్మక ప్రాంతాలలో పోలింగ్ ప్రశాంతంగా సాగింది. పోలింగ్ కేంద్రాల వద్ద భారీ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా భద్రతా చర్యలు చేపట్టారు. పట్టణంలోని 240 పోలింగ్ బూత్ వీవీప్యాడ్ సమస్యతో పోలింగ్ 10 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. వేసవికాలం కావడంతో ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు.

నిజాంసాగర్ (మహ్మద్‌నగర్): నిజాంసాగర్, మహ్మద్‌నగర్ ఉమ్మడి మండలాల్లో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. జుక్కల్ నియోజకవర్గంలోని పిట్లం మండల కేంద్రంలో ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్ రావు దంపతులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో జడ్పీ చైర్‌పర్సన్ దఫెదార్ శోభ రాజు, ఉమ్మడి జిల్లాల మాజీ జడ్పీ చైర్మన్ దఫెదార్ రాజు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు వేశారు. మహ్మద్‌నగర్ మండలంలోని పిప్పిరా గడి తండాలో ఓటర్లు తాండాలోమౌళిక సదుపాయాలు కల్పించే వరకు ఓటు వేయ్యమని భీష్మించుకుని కూర్చోవడంతో తహసీల్దార్ భిక్షపతి, ఎంపీడీవో గంగాధర్, ఎస్సై సుధాకర్‌లు హుటా హుటీన తాండాకు చేరుకున్నారు.తక్షణమే తాగునీరు, విద్యుత్ దీపాలు ఏర్పాటుకు కృషిచేస్తామని హామీ ఇవ్వడంతో తాండావాసులు శాంతించారు.

బీర్కూర్: బీర్కూర్ మండలంలో పోలింగ్ శాతం గంట గంటకు పెరుగుతూ వచ్చింది. ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు పెద్ద సంఖ్యలో పోటెత్తారు. మండుటెండలను సైతం లెక్క చేయకుండా ఓటు వేసేందుకు ఆసక్తి చూపారు. కొన్ని గ్రామాల్లో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైనా మధ్యాహ్నం వరకు తిరిగి పోలింగ్ శాతం పుంజుకుంది. ఇదిలా ఉండగా ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డిలు బీర్కూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో పర్యటించి పోలింగ్ సరళిని పరిశీలించారు.

జిల్లా వ్యాప్తంగా ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

● కొత్త జీపీలకు పోలింగ్ బూత్‌లు లేకపోవడంతో ప్రజల ఇబ్బందులు ● పలు చోట్ల సాంకేతిక కారణాల వల్ల మొరాయించిన ఈవీఎంలు ● ఇబ్బందుల్లో ఓటర్లు


చౌట్‌పల్లి క్యూలైన్‌లో సురేష్‌రెడ్డి ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి


ఆలూర్‌లోని మోడల్ పోలింగ్‌స్టేషన్


భీమ్‌గల్ మున్సిపల్..


ఎడపల్లిలో బారులు తీరిన ఓటర్లు

మోపాల్, మే 13: మండలంలోని ఆయా గ్రామాల్లో పార్ల మెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6గంటల వరకు ప్రశాంతంగా కొనసాగింది. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఒకప్పుడు నక్సల్స్ ప్రాభల్యం గల ప్రాంతాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తును ఉన్నతాధికారులు కట్టుదిట్టంగా ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశారు. ప్రజలు గుంపులు గుంపులుగా ఉండకుండా పోలీసులు వారిని చెదరగొట్టారు. పోలింగ్ బూత్ సమీపంలో బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఓటు వేయడానికి వచ్చిన ఓటర్లకు తమకు ఓటు వేయాలని వేడుకున్నారు. ఓటు వేసి వచ్చిన ఓటర్లను ఎవరికి ఓటు వేశారని కొన్ని పార్టీల నాయకులు వారిని అడిగినప్పటికీ తాము ఎవరికి వేస్తే మీకేంటని ఎదురు సమాధానం ఇచ్చారు. మండలంలోని న్యాల్‌కల్, సిర్పూర్, ముదక్‌పల్లి, కాల్పోల్, బైరాపూర్, అమ్రాబాద్, ఎల్లమ్మకుంట, మంచిప్ప, బాడ్సి, చిన్నాపూర్, కులాస్‌పూర్, కంజర్, మోపాల్, ఠాణాకుర్దు గ్రామాలతో పాటు నగర సమీపంలో ఉన్న బోర్గాం(పి), మాధవనగర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఆయా పార్టీల నాయకులు ఎవరికి వారు ప్రచారం చేసుకున్నారు. జూన్ 5వ తేదీన ఫలితాలు ఎలా ఉండ బోతాయోనని నాయకులు ఇప్పటి నుండే అంచనాలను వేసుకుంటున్నారు. గ్రామాల్లో పోలీసులు భారీ బందోబస్తును ఏర్పాటు చేశారు.

● కొత్త జీపీలకు పోలింగ్ బూత్‌లు లేక ఇబ్బందులు

గత ఐదు సంవత్సరాల క్రితం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఉండేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త జీపీలను ఏర్పాటు చేసినప్పటికీ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయాల్లో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయకపోవడంతో ఆయా గ్రామాల ప్రజలు ఓటు వేయడానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలింగ్ కేంద్రాలకు వెళ్లవల్సి వస్తుందని పలు గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని కులాస్‌పూర్ తాండా, ఒడ్డెర కాలనీ, శ్రీరాంనగర్ తండా, గుడితాండాలు కొత్తగా జీపీలుగా ఏర్పడ్డాయి. ఈ గ్రామ పంచాయతీలో పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయలేకపోయారు. ఓటర్లకు ఆయా పార్టీల నాయకులు ఆటోలను ఏర్పాటు చేసినప్పటికీ ఇబ్బందులు తప్పలేదని వారు వాపోయారు.

నవీపేట: నవీపేట మండలంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. వేసవికాలం కావడంతో ఉదయం నుండే ఓటర్లు పోలింగ్ బూత్‌లలో బారులు తీరారు. స్టేషన్ ఏరియాకు చెందిన ఉర్దూ మీడియం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో ఉదయం గంటపాటు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో సాంకేతిక నిపుణులు వచ్చి ఈవీఎంలు సరి చేయడంతో పోలింగ్ సజావుగా సాగింది. మండలంలోని సిరన్‌పల్లిలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి ఓటుహక్కును వినియోగించుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి మోకన్‌పల్లిలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. మండలంలోని పొతంగల్‌లో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఆర్.రాం కిషన్ రావు తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

జక్రాన్‌పల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం అన్ని గ్రామాల్లో ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌ల వద్ద బారులు తీరారు. మధ్యాహ్నం వరకు గ్రామాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించారు. మధ్యాహ్నం సమయం ఎండ తీవ్రత వల్ల పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు లేక నిర్మానుష్యంగా మారింది. అర్గుల్, సికింద్రాపూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పోలింగ్ సరళిని ఎన్నికల అబ్జర్వర్ పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల వద్ద ఏలాంటి సంఘటనలు జరగకుండా ఎస్సై సీహెచ్.తిరుపతి ఆధ్వర్యం లో పోలీసు బందోబస్తు నిర్వహించారు. పోలింగ్ ప్రశాంతం గా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

భీమ్‌గల్‌రూరల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోమవారం ఉదయం నుంచే ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయ 11 గంటల వరకు 28 శాతం ఓటింగ్ నమోదు అయ్యింది. మధ్యానం 3 గంటల వరకు 59 శాతం నమోదు అయ్యింది. భీమ్‌గల్ మండలంలోని 27 గ్రామ పంచాయితీల పరిధిలో ఎక్కడా అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోలేదు.సాయంత్రం వరకు ప్రశాంతంగా ఓటింగ్ ముగిసింది. అధికారులు అన్ని పకడ్బంది చర్యలు తీసుకున్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి, పెర్కిట్‌తో పాటు పట్టణంలో పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం పట్టణంలోని రాజారాం నగర్ 84వ పోలింగ్ బూత్‌లో పది నిమిషాలు పాటు ఈవీఎం మొరాయించింది. అలాగే వాలీంటర్ లేకపోవడంతో నడవలేని స్థితిలో ఉన్న ఓ వృద్ధుడిని కుటుంబసభ్యులే వీల్ చైర్‌పై పోలింగ్ కేంద్రానికి తీసుకువెళ్ళారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 59వ బూత్‌ని యూత్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేయడంతో యువత తమ ఓటు హక్కును వినియోగించుకొని ఫోటోలు దిగారు. అలాగే పలువురు యువకులు ఆటోలలో వచ్చిన వృద్ధులను వీల్‌చైర్‌లో కూర్చొబెటడానికి సహయపడ్డారు.

● ఓటు హక్కు వినియోగించుకున్న మున్సిపల్ చైర్‌పర్సన్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో పోలింగ్ కేంద్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య దంపతులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ సబ్‌డివిజన్‌లోని వివిధ మండలాల్లో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం నుంచే ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలివచ్చారు.అంకాపూర్‌లోఎమ్మెల్యే పైడిరాకేష్‌రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గోవింద్‌పేటలో 102ఏళ్ళ వృద్దురాలు మారెమ్మ తమఓటు హక్కు వినియోగించుకున్నారు. మంథనిలో మూడు బూత్‌లు ఉండగా ఒక బూత్‌లో 1150ఓట్లు ఉండడంతో మహిళలు ఓటు వేసేందుకు గంటల తరబడి వేచిఉండాల్సి వచ్చింది.ఓటింగ్‌సరళిని బీఆర్ఎస్ అభ్యర్థి బాజిరెడ్డి గోవ ర్ధన్ మాజీఎమ్మెల్యే జీవన్‌రెడ్డితో కలిసిఆర్మూర్‌లో పరిశీలించారు.

ముప్కాల్:పార్లమెంట్ ఎన్నికలు ముప్కాల్ మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. ముప్కాల్ మండలంలో 77శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం నుంచే ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాల వద్దకు తరలివచ్చారు.బా ల్కొండ నియోజకవర్గ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పో లింగ్ బూత్‌లను పరిశీలించారు. బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ పోలింగ్ కేంద్రాల్లో మహి ళలతో ముచ్చటించారు. ఏలాంటి అవాంచనీయ సంఘట నలు జరుగకుండా ఎస్సై భాస్కర చారి పోలీసు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

వేల్పూర్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా వేల్పూర్ మండల గ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సోమవారం మండలంలో 39పోలింగ్ బూత్‌లలో ఉదయం 7గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఏలాంటి అవాంచనీయ సంఘట నలు జరుగకుండా ఎస్సై వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద బందోబస్తు నిర్వహించారు.

● వేల్పూర్‌లో ఓటు వేసిన ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్

వేల్పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆయన కుటుంబసభ్యులు, డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పచ్చలనడ్కుడ గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోలింగ్ బూత్‌లో రాష్ట్ర సీడ్ కార్పోరేషన్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి తమ ఓ టు హక్కును వినియోగించుకున్నారు.

పచ్చలనడ్కుడలో మొరాయించిన ఈవీఎంలు

మండలంలోని పచ్చలనడ్కుడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలలో ఈవీఎంలు కొద్దిసేపు మొరాయించారు. ఈవీఎంలలో బ్యాటరీ కావడం, మరోక ఈవీఎంలో ఓటు వేసినప్పటికీ బ్రీత్ సౌండ్ రాకపోవడంతో కొద్దిసేపు పోలింగ్‌కు అంతరాయం కలగడంతో వాటిని వెంటనేసరిచేసి పోలింగ్‌ను కొన సాగిం చారు.

మాక్లూర్: మండల కేంద్రంలో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. ఏలాంటి అవాంచనీయ సంఘటలు జరుగకుండా పోలీస్‌బందోబస్తు ఏర్పాటు చేశారు.మండలంలో వెంకటాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ చైర్మన్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మాక్లూర్ పోలింగ్ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి పరిశీలించారు.

ఇందల్వాయి: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ఇందల్వాయి మండలంలోని అన్ని గ్రామాలలో ఉదయం 7గంటలకే ఎన్నికలు ప్రారంభం కాగా సాయంత్రం 6గంటలకు పోలింగ్ ముగిసింది. మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ తన సొంత గ్రామమైన నల్లవెల్లిలో కుటుంబ సభ్యులతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాజీ ఎంపీపీ ఇమ్మడిగోపి గౌరారం గ్రామంలో తన ఓటును వేశారు. ఇందల్వాయి ఎంపీపీ రమేష్ నాయక్ రూప్లానాయక్ తండాలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ధర్పల్లి:మండలంలో పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా ముగిసాయి. మండలంలోని 35 పోలింగ్ బూత్‌లలో ఉదయం నుంచే ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.మండలానికి చెందిన వివిధ ప్రాంతాల్లో ఉన్న వారు ఓటు హక్కు కోసం సొంత గ్రామాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తంమీద పోలింగ్ ప్రశాంతంగా ముగియడం పట్ల పోలీసులు, రెవెన్యూ, పోలింగ్ సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు.

డిచ్‌పల్లి: మండల వ్యాప్తంగా పార్లమెంట్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఘన్‌పూర్ , ధ్మారం(బి) ఈవీయంల మొరాయింపుతో 20 నిమిషాల పాటు పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ముల్లంగి గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో మాక్ పోలింగ్ లో ఈవీయం ల మొరాయింపుతో 15నిమిషాలు ఆలస్యం జరిగింది. ధర్మారం(బి)లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మండవ వెంకటేశ్వర రావు దంపతులు ఓటు హక్కువినియోగిం చుకున్నారు. రాంపూర్‌లో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆయన ఓటింగ్‌లో పాల్గొన్నారు. అమృతాపూర్ గ్రా మంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులచారి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

సిరికొండ: సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది.సాయంత్రం ఆరు గంటల వరకు 71 శాతం మంది ఓటర్లు తమ ఓట్లు హక్కును వినియోగించుకున్నారు. చిన్నావాల్గోట్, పందిమడుగు గ్రామాల్లో గంట సేపు ఈవీఎంలు మొరాయిండంలో సాంకేతిక నిపుణులు వచ్చి ఈవీఎంలను మార్చి పోలింగ్ కొనసాగాలే చేశారు. మండలంలో ఎలాంటి అవాంచ నీయ సంఘటనలు జరుగకుండా పోలీస్ పటిష్టమైన బందోబస్తు నిర్వహించారు. సిరికొండ మండలంలో 33497 మంది ఓటర్లు ఉండగా 23.36 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మొత్తం మీదా 71 శాతం పోలింగ్ నమోదు అయినట్లు తహసిల్దార్ రవీందర్‌రావు తెలిపారు.

బోధన్‌రూరల్: సోమవారం ఉదయం 7గంటలకు ప్రారంభమైన పార్లమెంట్ ఎన్నికలు సాయంత్రం వరకు కొనసాగాయి. పట్టణంలోని హనుమాన్ టెకిడిలతో పాటు పలు చోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ప్రజలు బారులు తీరి అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. 144సెక్షన్ అమలులో ఉందని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ భారీ పోలీసు బలగాలతో పర్యటించారు. చెదురు ముదురు ఘటనలు మినహా లోక్‌సభ ఎన్నికలు బోధన్‌లో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం పూట ఓటర్లు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచారు.ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగడానికి బోధన్ ఏసీపీ శ్రీనివాస్, ఎన్నికల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి అంబదాస్ రాజేశ్వర్, తహసీల్దార్ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఎన్నికలు నిర్వహించారు.

రెంజల్: మండలంలో సోమవారం పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 7గంటల నుంచే పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. ఓటర్లు ఉత్సహంగా ఓటు వేసేందుకు తరలివచ్చారు. పోలింగ్ ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఎడపల్లి: ఎడపల్లి మండలంలో సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని 36 పోలింగ్ కేంద్రాలలో మండలంలోని ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించకున్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో జరుగుతున్న పోలంగ్ సరళిని బిజేపి పార్టీ ఎంపీ అభ్యర్థి దర్మపురి అదవింద్, స్థానిక ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిలు పరిశీలించి కార్యకర్తలతో మాట్లాడారు.

కమ్మర్‌పల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో సోమవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగ జరిగింది. మండలవ్యాప్తంగా సాయంత్రం 5 గంటలవరకు 71.36 శాతం పోలింగ్ నమోదయిందని ఎన్నికల అధికారులు తెలిపారు. కాగా మండలంలోని అన్నిగ్రామాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. ప్రముఖులు రాజ్యసభ సభ్యులు సురేష్ రెడి,మాజీ ఎమ్మెల్యే ఏలేటి అన్నపూర్ణమ్మ,మల్లికార్జున్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డివారి స్వగ్రామాల్లో ఓటు హక్కును వినయోగించుకున్నారు.


బోధన్ ఓటు వేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు


వృద్ధురాలిని చేతులపై తీసుకువెళ్తున్న యువకుడు


ఆర్మూర్‌లో ఓటు వేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు


పిప్రిలో పోలింగ్ కేంద్రంలో ..


పసిపాపతో ఓటు వేసేందుకు మహిళ, సీపీ



వేల్పూర్ పోలింగ్ కేంద్రంలో..


పిప్రిలో పోలింగ్ కేంద్రంలో..

కాంగ్రెస్ కూటమి గెలుపు ఖాయం

● బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట,మే13: కేంద్రంలో కాంగ్రెస్ కూటమి గెలుపు ఖాయమని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తమ స్వగ్రామం అయిన మండలంలోని సిరన్‌పల్లిలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో 60ఏళ్ల కాంగ్రెస్ పాలనలో అనేక అభివృద్ధి పనులను చేపట్టడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. గత 10సంవత్సరాల బీజేపీ పాలనలో దేశంలో జీఎస్టీ పేరుతో లక్షల కోట్ల పన్నులు వసూలు చేసినప్పటి కీ అభివృద్ధి మాత్రం శూన్యమని అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలలో జరిగిన పోలింగ్ సరళిని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంతిరెడ్డి రాజిరెడ్డి, సురేందర్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, కిరణ్ కుమార్ తదితరులున్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడే వారికే ఓటెయ్యాలి

● బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం


చందూర్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం

వర్ని,మే13: ప్రజాస్వామ్య విలువలను కాపాడే వారికే ఓటేస్తే గ్రామ, రాష్ట్రస్థాయి నుంచి దేశ విలువలను కాపాడే వారం అవుతామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం చందూర మండల కేంద్రంలో మండల స్థాయి నాయకులతో ఓటింగ్ సరళిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. దొంగ చేతికి తాళం ఇస్తే ప్రజలు దొంగకే అధికారం ఇచ్చారన్న భావనతో దేశాన్ని, రాష్ట్రాన్ని దోచుకుపోయే ప్రమాదం దొంగలకు కల్పించినట్లు అవుతుందని ఎమ్మెల్యే పోచారం ఆందోళన వ్యక్తం చేశారు. డబ్బుకు లాలూచీ పడి ఓటేస్తే ఆ వ్యక్తి సంపాదన రెట్టింపు పెరిగి మరింత ఆదాయం సమకూర్చే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. 77ఏళ్ల స్వాతంత్రం తర్వాత అవినీతి అక్రమార్కులకు అవకాశం కల్పించకుండా తమ ఓటే ఆయుధంగా ప్రజలు వినియోగించుకుని అవినీతిపరులను పారద్రోలే వారి చేతుల్లోనే ఉందని స్పష్టం చేశారు. సమావేశంలో నాయకులు సాయిరెడ్డి, ప్యారం అశోక్, రామిరెడ్డి, ఎంపీపీ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న ఏసీపీ

పెర్కిట్, మే13: ఆర్మూర్ పట్టణంలోని రాజారాంనగర్ ప్రాథమిక పాఠశాలలోని పోలింగ్ కేంద్రంలో సోమవారం హైదరాబాద్ ఏసీపీ గంగాధర్ భార్య మాదవితో కలిసి ఓటు వేశారు. విద్యార్థి దశలో తను విద్యను అభ్యాసించిన పాఠశాలలో ఏసీపీ హోదాలో ఓటు వేయడం చాలా సంతోషంగా ఉందని అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు.


ఆర్మూర్‌లో ఓటు వేసిన హైదరాబాద్ ఏసీపీ దంపతులు

బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటాం

● బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్

బోధన్‌రూరల్,మే13: బీజేపీ కార్యకర్తలకు అండగా ఉంటానని, బీజేపీ కార్యకర్తలపై ఇతరులు దాడి చేస్తే సహించేది లేదని బీజేపీ ఎంపీ అభ్యర్థి ధర్మపురి అరవింద్ అన్నారు. సోమవారం బోధన్ పట్టణంలోని ఓ పోలింగ్ బూత్‌లో మాటమాట పెరిగి బీజేపీ కార్యకర్తను ఇతర పార్టీల వారు కొట్టడంతో గాయాలయ్యాయన్నారు. బీజేపీ కార్యకర్తను కొట్టిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. బీజేపీ కార్యకర్తలపై ఎవరు దాడి చేసిన సహించేది లేదని పేర్కొన్నారు. ఆయన వెంట బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, బోధన్ నియోజకవర్గ ఇన్చార్జి మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు నర్సింహ రెడ్డి, బాలరాజు, సుధాకర్ చారి, బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

అక్రమంగా తరలిస్తున్న డబ్బు పట్టివేత

బోధన్‌రూరల్,మే13: ఆదివారం రాత్రి బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రాంతంలో ఎలాంటి ధ్రువపత్రాలు లేకుండా 5.42లక్షల రూపాయలు తీసుకెళ్తున్న వ్యక్తి డబ్బులను స్వాధీనం చేసుకున్నామని బోధన్ పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. డబ్బులు పట్టుకున్న వ్యక్తి వద్ద డబ్బులకు సంబంధించిన సరైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేయడం జరిగిందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు డబ్బులకు సంబంధించిన పత్రాలు చూయించాలని పేర్కొన్నారు.

ఓటు హక్కు వినియోగించుకున్న మాజీఎమ్మెల్యే

ముప్కాల్, మే13: మాజీఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర ఖనిజ అభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్ సోమవారం బాల్కొండ మండలం కిసాన్‌నగర్ గ్రామంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. భారతరాజ్యాంగం కల్పించిన ప్రతీ ఒక్కరు ఓటు వినియోగించుకోవాలని ఆయన అన్నారు.


కిసానగర్‌లో ఓటు హక్కు వినియోగించుకున్న మాజీఎమ్మెల్యే ఈఈరవత్రి అనిల్

బీఆర్ఎస్ , బీజేపీ మధ్యనే ప్రధాన పోటీ

● బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్

సిరికొండ మే 13: సోమవారం జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో నిజామాబాద్ నియోజక వర్గంలో ప్రధాన పోటీ బీఆర్ఎస్ - బీజేపీ పార్టీల మధ్యనే ఉందని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు.సిరికొండ మండలం రావుట్ల గ్రామంలో సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి తమ ఓటు హక్కును వినియోగించుకున్న అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ జగిత్యాల, కోరుట్ల , బాల్కొడం నియోజక వర్గాల్లో ఓటింగ్ సరళిని పరిశీలించినట్లు ఆయన చెప్పారు. ఓవరాల్‌గా నిజామాబాద్ పార్లమెంటు నియోజక వర్గంలో ప్రధాన పోటీ బీఆర్ఎస్ - బీజేపీ పార్టీల మధ్యనే ఉందన్నారు. కాంగ్రెస్ పార్టీ మూడో స్థానంలో నిలుస్తుందని బాజిరెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ గల శాసన సభ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చక పోవడం వల్లే ప్రజల్లో వ్యతిరేక పెరిగిందని ఆయన చెప్పారు. మహిళల్లో కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల తీవ్రమైన వ్యతిరేక ఏర్పడటం వల్ల బీఆర్ఎస్‌కు ఓటు వేశారని ఆయన వెల్లడించారు.రుణమాఫీ, మహిళలకు రూ. 2500లు హామీలను అమలు చేయక పోవడం వల్ల ప్రభుత్వం పట్ల రైతులు, మహిళలు ఆగ్రహంతో ఉన్నారని ఆయన చెప్పారు.తాను గెలువడం పక్కా అని బాజిరెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

ఓటు హక్కును వినియోగించుకున్న మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి

మోపాల్, మే 13: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా సోమవారం మాజీఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి మండలంలోని బాడ్సి గ్రామంలో కుటుంబ సమేతంగా వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి జీవన్‌రెడ్డి గెలవబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు.

కోనాసముందర్‌లో 89.29 శాతం పోలింగ్

కమ్మర్‌పల్లి, మే 13: మండలంలోని కోనాసముందర్ గ్రామ పరిధి అనుబంధ గ్రామం గుడిలింగాపూర్‌లో 89.29 శాతం పోలింగ్ జరిగినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. గతంలో మానాల పరిధి అనుబంధ గ్రామమైన గుడిలింగాపూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఉంటారు. అయితే ఈ గ్రామం మండలకేంద్రానికి 55 కిలోమీటర్ల దూరంలోగల గుడిలింగాపూర్ గ్రామంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో గ్రామంలోనే ప్రత్యేకంగా పోలింగ్ బూత్ (143) ఏర్పాటు చేశారు. (గతంలో గ్రామం నుంచి 28 కిలోమీటర్ల దూరంలోగల మానాలలోని 151వ నెంబర్ పోలింగ్ బూత్‌లో ఓట్లు వేసేవారు) గ్రామంలో మొత్తం ఒకే కుటుంబానికి చెందిన 56 మంది ఓటర్లుండగా సోమవారం 50 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు.

చికెన్ ధరలు





రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.140	రూ.270	రూ. 290
వెన్‌కాబ్(కిలో)	: రూ.145	రూ.275	రూ. 295

బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.73,100	రూ.67,400	రూ.860

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (10.30)
: కృష్ణమ్మ (1.40, 7.45, 10.40)
: బాక్ (4.35)
స్క్రీన్-2 : కృష్ణమ్మ (10.20)
: ప్రతినిధి-2 (1.15)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (4.10)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (7.20, 10.30)
స్క్రీన్-3 : శ్రీకాంత్ (హిందీ) (10.25, 1.25, 7.20, 10.20)
: ఆ ఒక్కటి అడక్కు (4.25)
స్క్రీన్-4 : ప్రతినిధి-2 (10.40, 7.35, 10.30)
: ఆరంభం (1.35)
: ప్రసన్నవధనం (4.30)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ప్రతినిధి-2 (10.45, 430, 10.30)
: కృష్ణమ్మ (1.35)
: ఆ ఒక్కటి అడక్కు (7.30)
స్క్రీన్-2 : ఆ ఒక్కటి అడక్కు (1.40)
: బాక్ (4.30)
: కృష్ణమ్మ (7.30, 10.30)
స్క్రీన్-3 : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (ఇంగ్లీష్) (10.50)
: కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (1.45, 4.40, 7.30, 10.30)

దేవి : టిల్లు స్క్వేర్ (11.15, 2.15)
: ఆ ఒక్కటి అడక్కు (6.15, 9.15)
లలితమహోల్ : ప్రతినిధి-2 (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : కింగ్ డమ్ ఆఫ్ ది ప్లానెట్ (తెలుగు) (11.15, 2.15, 6.15 9.15)
విజయ్ : కృష్ణమ్మ (11.15, 2.15, 6.15, 9.15)



- నిజామాబాద్ అర్బన్